నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిచేస్తాం



మొక్కను నాటి నీరుపోస్తున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే వివేకానంద్

గాజులరామారం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని కైలాస్‌హిల్స్‌లో రూ.29.60 లక్షలతో నూతనంగా చేపట్టిన భూగర్భడ్రైనేజీ పనులను ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పదేళ్ల కాలంలో జీహెచ్ఎంసీలోని అన్ని డివిజన్‌లతోపాటు నిజాంపేట్ కార్పొరేషన్, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీల్లో కోట్ల రూపాయలు వెచ్చించి ఎంతో అభివృద్ధి చేశామన్నారు. అనంతరం కాలనీ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్‌సింహారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, నాయకులు కస్తూరి బాల్‌రాజ్, చెట్ల వెంకటేష్, మక్సూద్, ఇబ్రహీం, సాయినాథ్‌నేత తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

హైదర్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. బిల్లుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 45 మందికి మంజూరైన రూ.18,42,000లకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతోమంది పేదల ప్రాణాలను కాపాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి, రామచంద్రరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నరేందర్ ప్రసాద్, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్ కాలనీ డివిజన్ శంషీగూడ పరిధిలోని అనసూయమ్మ మహంకాళినగర్‌లో జరుగుతున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు, తాగునీటి వంటి వసతులు కల్పిస్తున్నామన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కాలనీవాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శ్రీనివాస్, ధాతి రమేష్, వెంకటేష్, శేషు, సత్యనారాయణ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యపై సమీక్ష

హైదర్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్-జేఎన్‌టీయూ ప్రధానరహదారి నుంచి అడ్డగుట్ట సమతానగర్ మీదుగా ప్రగతినగర్ రోడ్డుకు వెళ్లే కూడలి వద్ద ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యపై శనివారం ట్రాఫిక్ సీఐ వెంకట్‌తో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు సమీక్షించారు. నిత్యం ట్రాఫిక్‌జాం అవుతూ స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సీఐను కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల కోసం రోడ్లను తవ్వి సక్రమంగా పూడ్చాలన్నారు. వ్యాపార దుకాణాల వద్ద వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లోనే పార్కింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అధికారులు, నాయకులు కుమారస్వామి, నిరంజన్‌రెడ్డి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిశీలించిన బీజేపీ

గచ్చిబౌలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ పార్టీ నాయకులతో కలిసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అంజయ్యనగర్, సిద్దిక్‌నగర్‌లో పాదయాత్ర చేసి, సమస్యలను తెలుసుకున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజల తరుపున తాము సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణయాదవ్, రవినాయక్, సంతోష్, సరోజారెడ్డి, ఆత్మరావ్, బనిసిలాల్, కిషన్‌జీ, అరవింద్, యాదగిరి పాల్గొన్నారు.

ఘనంగా హోప్ ఫౌండేషన్ వార్షికోత్సవం



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్

మాదాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): హోప్ ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని మాదాపూర్‌లోని వార్డు కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల మధ్య ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ కేక్‌కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా కార్మికులకు చీరలు, దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2016లో ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి పేదలకు నిరంతరం సేవ చేస్తున్నట్లు తెలిపారు. పేద క్రీడాకారులు, విద్యార్థులు, అనారోగ్యంతో ఇబ్బంది పడేవారికి ఇలా ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఫౌండేషన్ సేవలు మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ హోప్ ఫౌండేషన్ సభ్యులు బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సుచిత్ర అకాడమీ వార్షిక సదస్సు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సుచిత్ర అకాడమీలో రెండురోజుల పాటు అంతర్జాతీయ సదుస్సు జరిగింది. ఇందులో ఆరో వార్షిక సదస్సు మోడల్ యునైటెడ్‌నేషన్స్‌పై చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్ ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి, జాయింట్ క్రైసెస్ కమిటీ హైలెవల్ పొలిటికల్ ఫోరం సెస్టయినబుల్ డెవలప్‌మెంట్, ఆల్ ఇండియా పొలిటికల్ పార్టీస్, ఇంటర్‌నేషనల్ ప్రెస్, ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లమిక్ కో-ఆపరేషన్‌ల ఉన్నత స్థాయితో సహా పలు కమిటీలలో వివిధ దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 290 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుచిత్ర అకాడమీ ప్రిన్సిపాల్ దీపాకపూర్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా కేన్సర్ స్ర్కీనింగ్ వైద్య శిబిరం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉచితమెగా కేన్సర్ స్ర్కీనింగ్ వైద్య శిబిరం ఆదివారం ఏర్పాటు చేస్తున్నట్లు మెడికవర్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వీహైటెక్‌సిటీలోని మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం ఉదయం 10 నుంచి 5 గంటల వరకు పలువురు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ అంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ, గైనకాలజీ, జనరల్ సర్జరీ, పల్మనాలజీ, ఈఎన్‌టీ, జనరల్ ఫిజిషియన్ వైద్యులు ఈ వైద్యశిబిరంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. దీర్ఘకాలిక దగ్గు, దగ్గినప్పుడు రక్తం రావడం, తరచుగా జ్వరం, ఇన్ఫెక్షన్లు రావడం, శరీరంపై గడ్డలు, లింఫ్ నోడ్స్‌వాపు, చనుమొనల నుంచి ద్రవం స్రవించడం, యోని నుంచి అధిక మోతాదులో డిశ్చార్జీ కావడం, రుతుస్రావం గడ్డలుగా రావడం లక్షణాలతోపాటు, కుటుంబ నేపథ్యంలో కేన్సర్ ఉన్నవారు, దీర్ఘకాలికంగా పొగతాగే వారు, పొగాకు నమిలే వారు, రేడియేషన్‌కు అతిగా గురయ్యే వారు, కాలుష్యం, కెమికల్స్ వాటిల్లో పనిచేసే వారు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంప్లీట్ బ్లడ్ పిక్చర్, ర్యాండమ్ బ్లడ్ షుగర్, మమోగ్రఫీ పరీక్షలను నిర్వహిస్తారని, వివరాల కోసం 9154316236/040 68334455 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

సూరారం, బతుకమ్మ ఘాట్‌లో పడకేసిన పారిశుధ్యం

సకాలంలో తొలగించడంలో అధికారులు విఫలం



రైతుబజార్ ముందు గుట్టలుగా చెత్త

షాపూర్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం డివిజన్‌లో పలు కాలనీలు, బస్తీల్లో చెత్త పేరుకుపోయింది. ఈ సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉంటాయి. ఇప్పటికే ప్రజలు విషజ్వరాలతో ప్రభుత్వ దవాఖానాలకు క్యూ కడుతున్నారు. స్లమ్ ఏరియాల్లోని ప్రతి బస్తీలో సుమారు 10 నుంచి 20 మంది రోగులు ఉన్నట్లు ఆరోగ్య సిబ్బంది గత నెలలో నిర్వహించిన ఇంటింటి సర్వేలో వెల్లడయింది. కానీ పరిసరాలను శుభ్రంగా ఉంచడం, ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలం అవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుట్టలుగా పేరుకుపోయిన చెత్త కురుస్తున్న వర్షాల వల్ల కుళ్లి విపరీతమైన దుర్గంధం వస్తోందని స్థానికులు అంటున్నారు. కుళ్లిన చెత్తపై దోమలు, ఈగలు వృద్ధి చెంది బస్తీల్లో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ సిబ్బంది, అధికారులు స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని కోరుతున్నారు.



సూరారం ప్రధాన రహదారి సాయిబాబనగర్ చౌరస్తాలో చెత్త

బతుకమ్మ ఘాట్‌లో ..



ప్రగతినగర్ బతుకమ్మ ఘాట్ ప్రధాన గేటు ఎదుట నిలిచిన మురుగునీరు

నిజాంపేట్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. మున్సిపల్ అధికారులు స్వచ్ఛ హైదరాబాద్ పేరుతో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు లక్షల రూపాయలను ఖర్చుచేస్తున్నారు. కానీ ప్రగతినగర్‌లోని బతుకమ్మ ఘాట్‌లో పారిశుధ్యం అపరిశుభ్రంగా ఉంది. ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు, బీరుబాటిళ్లు దర్శనం ఇస్తున్నాయి. అయినా కూడా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో ప్రగతినగర్ బతుకమ్మఘాట్ సమస్యల ఘాట్‌గా మారింది.



వాకింగ్ ట్రాక్‌లో చెత్త కాగితాలు, బస్తాలు



ఫెన్సింగ్‌ను అనుకొని గుట్టలుగా వేసిన చెత్త

సాయంత్రం అయిందంటే ఆకతాయిలు తిష్టవేసి రాత్రి వరకు అక్కడే ఉంటూ వచ్చిపోయే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రగతినగర్ బతుకమ్మ ఘాట్‌ను శుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

కేపీహెచ్‌బీ డివిజన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు

హైదర్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ డివిజన్‌లో శనివారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా మలేషియా టౌన్‌షిప్ వెనుకాల ఐదెకరాల పార్కును పరిశీలించి, పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. పక్కనే ఉన్న ఐదెకరాల స్థలంలో, 9వ ఫేజ్‌లో ఉన్న మూడెకరాల స్థలంలో జీహెచ్ఎంసీ లేదా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఆదర్శంతమైన పార్కును నిర్మించాలని తెలిపారు. దీనిపై ఇప్పటికే సీఎం, జిల్లా మంత్రికి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. వన్‌సిటీ పక్కనే ఉన్న హౌసింగ్ బోర్డు ఖాళీ స్థలాన్ని మహిళా పార్కు మాదిరిగా అభివృద్ధి చేయడంతోపాటు రోడ్డుపై నీళ్లు నిలవకుండా ఉండేలా వాటర్ హార్వెస్టింగ్ పిట్స్ నిర్మించాలని ఆదేశించారు. అనంతరం ఫోరంమాల్ ముందు ఫ్లైఓవర్ కింద ఇండోర్ క్రీడా ప్రాంగణానికి సంబంధించిన పనులను పరిశీలించారు. త్వరగా పనులను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కేపీహెచ్‌బీ డివిజన్‌లో పదేళ్లలో వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఈఈ శ్రీనివాస్, డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, యూబీడీ సమత, వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని స్పీకర్‌కు ఫిర్యాదు

హైదర్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రొటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు శనివారం ఎమ్మెల్యే కృష్ణారావు ఫిర్యాదు చేశారు. మూడుసార్లు ప్రజల మద్దతుతో భారీ మెజార్టీతో గెలుపొందిన తను ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుంటే కొందరు అధికారులు ప్రొటోకాల్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఫిర్యాదు చేశారు. తాను ఇచ్చిన ఫిర్యాదుపై స్పీకర్ సానుకూలంగా స్పందించారని, వెంటనే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి శాసనసభ్యుడి హక్కులకు భంగం కలిగించే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారని ఎమ్మెల్యే తెలిపారు.

జేఎన్‌టీయూలో మెగా జాబ్‌మేళా





జేఎన్‌టీయూకు తరలొచ్చిన నిరుద్యోగులు, అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులు

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ గ్రీన్‌లాండ్స్, జేఎన్‌టీయూ నిపుణ, హెచ్‌ఆర్‌కో సంయుక్తంగా జేఎన్‌టీయూ క్యాంపస్‌లో రెండు రోజుల పాటు జరిగే మెగా జాబ్‌మేళాను శనివారం ప్రారంభించారు. ఈ జాబ్‌మేళాలో ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్, ఆటోమొబైల్, రిటైల్, ఎలక్ట్రికల్ సంస్థల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మెగా జాబ్‌మేళాలో దాదాపు 5 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి రోజు జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించిన వారికి ఆఫర్ లెటర్లను అందించారు.

సంస్కృత శ్లోకాల పఠనంలో కవలల ప్రపంచ రికార్డు



ప్రపంచ రికార్డు సాధించిన కవలలు నిహస్వి ఉప్లాంచివార్, నిహార్ష్ ఉప్లాంచివార్

గచ్చిబౌలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు నిహస్వి ఉప్లాంచివార్, నిహార్ష్ ఉప్లాంచివార్ కవలలు(3 సంవత్సరాల 8 నెలల 16 రోజులు) చిన్న వయస్సులో సంస్కృత శ్లోకాలను పఠించడంలో ప్రపంచ రికార్డు నెలకొల్పారని పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్‌మై తెలిపారు. అంత్యంత పిన్న వయస్సులో ఈ కవలలు ఇంటర్నేషనల్ రికార్డుల బుక్‌లో స్థానం సంపాదించారని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు శృమిత్, రవళి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం చిన్నారులను, వారి తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

నైపర్‌లో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



నైపర్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న డా.అరుణ్‌చావ్లాతో అతిథులు

బాలానగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్)లో డ్రగ్స్ డిస్కవరీ, డెలివరీ డయాగ్నసిస్ అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. కేంద్ర ఫార్మాస్యూటికల్ విభాగం కార్యదర్శి డా.అరుణ్‌చావ్లా ముఖ్యఅతిథిగా నైపర్ గవర్నర్ల బోర్డు చైర్మన్, లారస్ ల్యాబ్స్ సీఈవో డా.సత్యనారాయణ గౌరవ అతిథిగా హాజరై ప్రసంగించారు. డా.అరుణ్‌చావ్లా మాట్లాడుతూ ప్రమోషన్ ఆఫ్ రీసెర్చ్ ఇన్నోవేషన్ ఇన్‌ఫార్మా(పీఆర్ఐపీ) పథకం కింద నైపర్ హైదరాబాద్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ బల్క్ డ్రగ్స్‌కు ఎంపిక చేసినట్లు చెప్పారు. అనంతరం నైపర్ డైరెక్టర్ డా.శైలేంద్ర సరాఫ్ మాట్లాడుతూ హైదరాబాద్ నైపర్ కోసం 110 ఎకరాల భూమిని 160 ఎకరాలకు పెంచడంలో కృషి చేసిన డా.అరుణ్‌చావ్లాకు కృతజ్ఞతలు తెలిపారు. నైపర్ రూ.100 కోట్ల వ్యయంతో భారత ప్రభుత్వం ఆమోదింప బడిన బల్క్ డ్రగ్స్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధమవుతోందని అన్నారు. అనంతరం వేదికపై నైపర్ సావినీర్‌ను డా.అరుణ్‌చావ్లా ఆవిష్కరించారు. మెడికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మాకాలజీ, మెడికల్ డివైసెస్‌తో సహా వివిధ రంగాలకు చెందిన 131 పోస్టర్ ప్రదర్శనలు, 22 మౌఖిక ప్రదర్శనలను నైపర్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఉత్తమ పోస్టర్, మౌఖిక ప్రదర్శనలకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐఆర్ ఐఐసీటీ డైరెక్టర్ డా.శ్రీనివాస్‌రెడ్డి, నైపర్ డీన్ నందూరి శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.పంకజ్ కుమార్‌సింగ్, నైపర్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని దూషిస్తూ సోషల్‌మీడియాలో పోస్టుపెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

మియాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని తీవ్రపదజాలంతో దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టుపెట్టిన నాన్ రెసిడెంట్ ఇండియన్ వి.హరీష్‌రెడ్డిపై జీహెచ్ఎంసీ లేబర్‌సెల్ చైర్మన్ నల్ల సంజీవరెడ్డి మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి పోస్టుల వల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతినే పరిస్థితులు ఉన్నాయని, ఈ పోస్టు పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు శనివారం సంజీవరెడ్డి పేర్కొన్నారు.

సీపీఐ నాయకుడు సీతారామచంద్రరావు కన్నుమూత



దూళిపాల సీతారామచంద్రరావు(ఫైల్)

మియాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సుదీర్ఘ కాలం ఆఫీసు కార్యదర్శిగా, కోశాధికారిగా పనిచేసిన సీనియర్ నాయకుడు దూళిపాల సీతారామచంద్రరావు శనివారం తెల్లవారుజామున 4 గంటలకు కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని పార్టీ నాయకులు, బంధుమిత్రుల సందర్శనార్థం ఉదయం 10నుంచి 12 గంటల వరకు వృద్ధాశ్రమంలో ఉంచారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్ వద్ద మధ్యాహ్నం 1నుంచి 2 గంటల వరకు పార్థివదేహాన్ని ఉంచారు. అనంతరం ఆయన పార్థివదేహాన్ని మెడికల్ కళాశాలకు ఇచ్చామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

కుత్బుల్లాపూర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల బదిలీ

గాజులరామారం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్ఐ రజనీకాంత్ ముచ్చింతలపల్లెకు, ఆర్ఐ రేణుక బాచుపల్లికి బదిలీ అయ్యారు. బాచుపల్లిలో పనిచేస్తున్న ఆర్ఐ మంజుల కుత్బుల్లాపూర్‌కు వచ్చారు. రజనీకాంత్ స్థానంలో ఘట్‌కేసరిలో పనిచేసిన విజయ్‌కుమార్ బదిలీపై ఇక్కడికి అయ్యారు.

స్కూల్ బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి



స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటిస్తూ విద్యార్థులను గమ్యస్థానాలకు చేర్చాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. కొంపల్లి మున్సిపల్ పరిధిలోని సాధువాహిని ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో బస్సు డ్రైవర్లు, క్లీనర్లకు ట్రాఫిక్ సీఐ నాగరాజుతో కలిసి ఆయన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా కోటి కుంకుమార్చన



కోటికుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

చందానగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ శిల్పాఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి ఆలయం ప్రాంగణంలో ఫౌండర్, చైర్మన్ ఆధ్వర్యంలో శనివారం కోటి కుంకుమార్చన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం 8గంటల నుంచి రాత్రి 9 వరకు జరిగిన ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాలనీల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. ఉదయం అమ్మవారికి రమణమూర్తి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చక బృందం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.